వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

వెంకటేశ్(ఫైల్)

హయత్‌నగర్, జనవరి 8 : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఈ ఘటనలు హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్, రంగనాయకులగుట్టకు చెందిన మొర్రబోయిన వెంకటేశ్(38) హైటెక్ సిటీలోని ఓ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వెంకటేశ్‌కు భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా.. గత నెల 29న రాత్రి వెంకటేశ్.. భార్య లావణ్యకు ఫోన్‌చేసి నైట్ షిఫ్ట్ ఉందని మరుసటి రోజు ఉదయం వస్తానని చెప్పి ఇప్పటి వరకు రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించినా, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో ..

లావణ్య (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మునగనూరు పాత గ్రామానికి చెంది న దోమలపల్లి లావణ్య తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేస్తుంది. లావణ్య భర్త మృతి చెందగా, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కాగా.. ఈ నెల 6న కుమారుడు .. తల్లిని నీవు పనిచేస్తున్న డబ్బులు ఏమి చేస్తున్నావు, వృథా చేయకు..అని అడిగినందుకు గొడవపడింది. 7న ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేయగా ఆస్పత్రికి వెళ్లానని చెప్పి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు..!

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనూ నిర్మాణాలు
- నాలాలను పూడ్చి మరీ కట్టడాలు..
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు

అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపడుతున్న షెడ్ల నిర్మాణం

బడంగ్‌పేట, జనవరి 8: మహేశ్వరం నియోజకవర్గంలో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు, హైడ్రా కమిషనర్‌కు, సీడీఎంఏకు పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చారు. హైడ్రా అధికారులు ఇప్పటికే మూడు, నాలుగు దఫాలుగా అక్రమ నిర్మాణాలను, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో కొనసాగుతున్న నిర్మాణా లను పరిశీలించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాలాలకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల జాబితాపై వివరణ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్లకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఫిర్యాదు దారులు చెబుతున్నారు. అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై ఎఫ్‌టీఎల్ పరిధిలో పెద్దపెద్ద షెడ్లు, పెట్రోల్ బంక్‌లు, గోదాములు వెలుస్తున్నాయని కార్పొరేటర్లు, స్థానిక నాయకులు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. లెనిన్ నగర్‌లో బఫర్ జోన్ పరిధిలో డబుల్ సెల్లార్లు, నాలాలను పూడ్చివేసి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులను ధ్వంసం చేసి, నాలాలను పూడ్చివేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. బాలాపూర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్‌తో సహా బహుళ అంతస్తుల నిర్మాణం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం.

అడ్డుకోవడంలో విఫలం..

బాలాపూర్ మండల పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం చెందారు. చెరువులో, ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నాయి.ఎలాంటి అనుమతులు లేకున్నా నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. అనుమతిలేని వాటికి నోటీసులు ఇస్తాం. చెప్పిన తర్వాత కూడా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ఇటీవల కొన్ని అక్రమ నిర్మాణాలను పరిశీలించాం. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటి పనులు ఆపివేశాం. *– సరస్వతి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్*

పట్టించుకోవడం లేదు..

ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. అల్మాస్‌గూడలోని ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోదాములు, ఫిర్నిచర్ షాపులు, పెట్రోల్ బంకులు వెలుస్తున్నాయి. నాలాలు పూడ్చివేస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి.
– అజయ్ కుమార్ , అల్మాస్‌గూడ

మహిళ లకు పోషకాహారంపై అవగాహన..


అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి

సైదాబాద్, జనవరి 8 : గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే రాబోయే సంతానం ఆరోగ్యంగా ఉంటుందని, మాతా శిశు సంక్షేమమే కుటుంబ సంక్షేమమని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని పూసలబస్తీ మూడుగుళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో రామకృష్ణ మఠం అనుబంధ ఆర్య జనని స్వచ్ఛంద సేవా సంస్థ చేపట్టిన గర్భిణుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా మహిళలకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం, వ్యాయామం, ధాన్యం మొక్క ప్రాధాన్యత వివరించి, వాటిని ఆచరించాలని సూచించి.. మహిళలకు పండ్లు, డ్రైఫ్రూట్స్, లడ్డూలు, తదితర పోషకాహార పదార్థాలను అందజేశారు. అదే విధంగా సైదాబాద్ క్రాంతిలోని బస్తీ దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందులు, సిబ్బంది కొరత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట సీడీపీవో పావని, విజయ, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత పాల్గొన్నారు.

వంశీ రాజ్‌ల రాష్ట్ర అధ్యక్షుడిగా మహేందర్

కందుకూరు, జనవరి 8 : రాష్ట్ర వంశీ రాజ్‌ల అధ్యక్షుడిగా మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఇజమల్ల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయనను ఎంపీ ఈటల రాజేందర్ సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి వంశీ రాజ్‌లు రాష్ట్రంలో కీలకమైన బాధ్యతలను అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు. వంశీరాజ్‌లను బలోపేతం చేయడానికి కృషి చేస్తాన్నారు. కార్యక్రమంలో పలువురు వంశీరాజ్‌లు పాల్గొన్నారు.

కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలు చేరుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ పిలుపునిచ్చారు. ఓయూ సివిల్స్ అకాడమీలో ఉచిత సివిల్ సర్వీసెస్, పోటీ పరీక్షల కోచింగ్‌ను బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కుమార్‌తో పాటు, పోటీ పరీక్షల నిపుణులు ఎం.బాలలత, ప్రొఫెసర్ చింత గణేశ్ హారయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కఠినమైన అంశాలను సులభతరంగా అర్థం చేసుకునే స్మార్ట్‌వర్క్‌తో కూడిన అధ్యయనం విద్యార్థులను ప్రభుత్వ అధికారులుగా చేస్తుందని అన్నారు. నాణ్యమైన పుస్తక సేకరణే విజయానికి ప్రధానమెట్టు అని అభివర్ణించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, కోఆర్డినేటర్ డాక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.

స్నేహితుడి హత్య కేసులో జీవితఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 8(నమస్తే తెలంగాణ): పోలీసులకు నేరాల గురించి సమాచారం ఇస్తానని, లేదంటే తనకు డబ్బులివ్వాలని డిమాండ్ చేసిన స్నేహితుడిని చంపేసిన నిందితుడు ఉస్మాన్ హుస్సేన్(35)కు యావజ్జీవకారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి కవిత తీర్పునిచ్చారు. అదనపు పీపీ టి.వెంకటేశ్వర ప్రసాద్ కథనం ప్రకారం..పహాడీషరీఫ్‌కు చెందిన నిందితుడు హుస్సేన్, మృతుడు సయ్యద్ హాజీ స్నేహితులు. ఇరువురు కలిసి పలు జేబు దొంగతనాలకు పాల్పడేవారు. అయితే హాజీ తనకు డబ్బులు ఇవ్వాలని, లేదంటే నేరాల గురించి పోలీసులకు సమాచారం ఇస్తానని నిత్యం హుస్సేన్‌ను బెదిరించేవాడు. దీంతో హుస్సేన్.. తన స్నేహితులైన మహ్మద్ అజార్, షేక్ జుబెర్ అహ్మద్ మరో జువైనల్‌తో కలిసి 2014 డిసెంబర్22న హాజీని చింతమెట్‌కు పిలిపించి మద్యం తాగుతూ కత్తి, ఐరన్ రాడ్‌లతో దాడి చేసి హత్య చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

భార్య హత్యకేసులో..

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 9 (నమస్తే తెలంగాణ): భార్యను హత్యచేసిన భర్త అల్వాల్ నర్సింహ(35)కు యావజ్జీవకారాగార శిక్ష, అయిదువేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి వై.జయప్రసాద్ తీర్పునిచ్చారు. అదనపు పీపీ రవికుమార్ వొద్యారపు కథనం ప్రకారం..కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన నిందితుడు నర్సింహ బతుకుదెరువు నిమిత్తం మహేశ్వరం మండలం మానిక్యమ్మగూడ గ్రామానికి తన కుటుంబంతో పాటు వలసవచ్చి కూలీనులు చేసుకుంటూ బతికేవారు. ఈ క్రమంలో చిన్న చిన్న విషయాలకు భార్య మంగమ్మతో గొడవపడుతూ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. వారి కుటుంబ సభ్యులు పలుమార్లు సర్థిచెప్పిన కూడా వినేవాడు కాదు. అయితే 2021నవంబర్29న రాత్రి ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. ఎలాగైన మంగమ్మను చంపివేయాలని నిర్ణయించుకున్న నిందితుడు ఆమె నిద్రపోయిన తరువాత ఎల్కట్రికల్ వైరు గొంతుకు బిగించి హత్య చేసి అనంతరం ఉరి వేసుకుని చనిపోయిందని చిత్రీకరించి.. అక్కడ నుండి పారిపోయాడు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసున మోదు చేసుకుని నిందితుడు నర్సింహను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

పాతవారికే షాపులు కేటాయించాలి

సుల్తాన్‌బజార్ : బేగంబజార్ చేపల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో షాపులను పాతవారికే కేటాయించాలని గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కృష్ణగుప్తా డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బేగంబజార్ ఫిషర్ మెన్ అసోసియేషన్ జల్ క్షత్రియ ప్రతినిధుల అభ్యర్థన మేరకు చేపల మార్కెట్‌లో సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. నిజాంకాలం నుంచి బేగంబజార్ చేపల మార్కెట్‌లో 1936 నుంచి చేపతలు విక్రయిస్తున్న వారికే నూతనంగా నిర్మించిన భవనంలో షాపులను కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మించి రెండేండ్లైనా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 19 లోగా అధికారులు నోటిఫికేషన్‌ను రద్దు చేయని పక్షంలో గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 21వ తేదీ నుంచి, మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 24వ తేదీ నుంచి, ఎంబీఏ (ఈవినింగ్) ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంఏ లాంగ్వేజెస్ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండు, మూడు సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి ఈ నెల 38వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈనెల 18వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 16వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వివిధ లా కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కాచిగూడ, జనవరి 8 : ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4500 కోట్లు వెంటనే విడుదల చేయాలని బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేదర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చాదర్‌ఘాట్‌లో బీసీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చట్టసభల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు.

నేడు పడమటి తండా పంచాయతీ

భవనం ప్రారంభం

బడంగ్‌పేట, జనవరి 8 : మహేశ్వరం మండల పరిధిలోని పడమటి తండాలో నూతనంగా నిర్మాణం చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాన్ని గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేయనున్నట్లు బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, బ్యాంక్ చైర్మన్లు, డైరెక్టర్లు హాజరు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.

'ముక్కోటి'కి ఆలయం ముస్తాబు

సైదాబాద్, జనవరి 8 : ముక్కోటి ఏకాదశి సందర్భంగా కరణ్‌బాగ్ కాలనీలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నామని ఆలయ ఈవో సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయంలో భక్తుల దర్శనార్థం ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఆలయాలను సర్వంగ సుందరంగా, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 8 : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్–8 డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నెహ్రూనగర్, 11కేవీ జవహర్ పురా, 11కేవీ పూలతోట ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ రెయిన్ బజార్, 11కేవీ వహేద్ కాలనీ, 11కేవీ జహంగీర్ నగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, 11కేవీ ఐఎస్ సదన్, 11కేవీ సలీమా ఖాతూన్, 11కేవీ యశ్రఫ్‌నగర్, 11కేవీ సోమ్ నాథ్ టెంపుల్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నగర ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వ ప్రసాద్ .. ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించి.. ప్రాణాలు కాపాడుకుందాం

- నగర ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వ ప్రసాద్
- ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీలో పోలీసు అధికారులు
- రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

సైదాబాద్, జనవరి 8 : వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు తగు జాగ్రత్తలతో వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాలను నిరోధించవచ్చని నగర ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వ ప్రసాద్ అన్నారు. ట్రాఫిక్ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సంతోష్‌నగ ర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రహదారి ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వాహనాలను నడపడంతోపాటు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనాలను నడిపేవారు హెల్మెట్, కారు సీటు బెల్ట్‌ను పెట్టుకోవడంతోపాటు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మద్యం సేవించి, రాంగ్ రూట్లలో అతివేగంగా వాహనాలను నడిపి తమ విలువై ప్రాణాలను పోగొట్టుకోవద్దని అన్నారు. ముఖ్యంగా యువతీ యువకులు జోష్‌లో అతివేగంగా వాహనాలను నడపవద్దని సూచించారు. అనంతరం కాలేజి విద్యార్థులతో కలిసి ఐఎస్ సదన్ చౌరస్తా నుంచి సైదాబాద్ దోభీ ఘాట్‌లోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజ్ వరకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీలు చంద్రకుమార్, లక్ష్మణ్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా నాయక్, ఎస్సైలు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధే లక్ష్యం

ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా కమిటీకి నూతనంగా ఎన్నికైన నాయకులను సన్మానించిన మిత్రమండలి గ్రూప్ సభ్యులు

చంపాపేట, జనవరి 8: ఆర్యవైశ్యులందరి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య నేతలు అన్నారు. ఆర్యవైశ్య మహాసభకు నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేశ్‌గుప్తా, జిల్లా విద్యా కమిటీ చైర్మన్ నాగబండి నగేశ్ గుప్తా, ఉపాధ్యక్షులు విజయరాములు గుప్తా, మధుసూదన్ గుప్త